సర్వేయర్లు వచ్చేదెప్పుడో?

- నెలల తరబడి నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు
- రెండు నుంచి మూడు మండలాలు సర్వేయర్లకు కేటాయింపు
- ముందుకు సాగని భూసర్వేలు



రాజంపేట మండలం తలమడ్లలో సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

రాజంపేట: రైతుల మధ్య భూ వివాదాలే తలెత్తిన సమయంలో సరిహద్దులు నిర్ణయించేందుకు రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు మీ–సేవా ద్వారా సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకుంటూరు. దీంతో సంబంధిత అధికారులు వచ్చి సర్వే నిర్వహించి ఇరువురి సరిహద్దులు చూపి సమస్యకు పరిష్కారం చూపుతారు. కానీ ఇదంతా జిల్లా వ్యాప్తంగా సజావుగా సాగడం లేదు. ఇందుకు కారణం జిల్లాలో సర్వేయర్ల కొరతే. ఉన్న అధికారులకు రెండు మూడు మండలాలు ఉండటంతో సకాలంలో సేవలు అందించడంలో విఫలం అవుతున్నారు.

ఇన్‌ఛార్జి సర్వేయర్లే దిక్కు..

రాజంపేట మండలానికి సర్వే అధికరి లేక సుమారు మూడు సంవత్సరాలు కావస్తుంది. భిక్నూర్‌లో ఉన్న సర్వేయర్ రాజంపేట మండలానికి ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. కానీ ఆయన ఎప్పుడు వస్తారో, ఎప్పుడు సర్వే నిర్వహిస్తారో తెలియక దరఖాస్తుదారులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సి వస్తుందని వాపోతున్నారు. రాజంపేట మండలంలో ఇప్పటికి 33 మంది రైతులు సరిహద్దుల నిర్ధారణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరు సుమారు రెండు, మూడు నెలల నుంచి సర్వే కోసం వేచి చూస్తున్నారు.

వివాదాలు తలెత్తే అవకాశం...

కొంత మంది ప్రైవేటు వ్యక్తుల సహాయంతో సర్వే చేయించుకుంటారు. అయితే ప్రభుత్వ సర్వేకు, ప్రైవేటు వ్యక్తులు చేసే సర్వేకు పొంతన కుదరకపోతే ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకునే ప్రమాదం ఉంది. ఇలాంటి ఘటనలు రాజంపేట తో పాటు జిల్లాలో పలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం సర్వేయర్ల కొరత తీర్చి సమస్యలకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

నాలుగు నెలల నుంచి వేచి చూస్తున్నా..



భూ కొలతల కోసం గత మార్చి నెలలో మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటికీ సర్వే అధికారులు రాలేదు.. సర్వే చేపట్ట లేదు. అధికారులు స్పందించి త్వరగా సర్వే చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

– మీర్ ముంతాజ్ అలీ, రైతు, రాజంపేట

ఇందిరమ్మ రాజ్యంతోనే గిరిజన న్యాయం

బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ కాలంలోనే గిరిజనులకు న్యాయం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఎస్సీ, ఎస్టీ, బీసీ అణగారిన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుందని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ సెగ్మెంట్ ఇన్‌చార్జి కాసుల బాలరాజ్ అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు కాసుల బాలరాజ్ బుధవారం రాత్రి మండలంలోని సోమ్లానాయక్ తండాలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తిరిగి ఇందిరమ్మ రాజ్యం స్థాపించడానికి ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీని బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాలేక్, నాయకులు గుడాల నగేష్, రెంజర్ల సాయిలు, నార్ల రాఘవేందర్ గుప్తా, చందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సోమ్లానాయక్ తండాలో బస చేస్తున్న నేతలు

గజ్యానాయక్ తండాలో..

మాచారెడ్డి: ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గజ్యా నాయక్ తండాలోని బన్సి నాయక్ ఇంటిలో కాంగ్రెస్ నేతలు బస చేశారు. గ్రామ సమస్యలను ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. బస చేసిన వారిలో ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ నౌసీలాల్ నాయక్, జిల్లా బీసీ సెల్ చైర్మన్ పుట్నాల శ్రీనివాస్, తదితరులున్నారు.

అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ



గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో మదన్‌మోహన్



పూజలు చేస్తున్న సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ రావు అన్నారు. గురువారం భిక్కనూర్, వెంకటాపూర్, శివాపూర్ గ్రామాలలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, ఆరిఫ్ తదితరులున్నారు.

పీసీసీ కార్యదర్శి సుభాష్ రెడ్డి పల్లె నిద్ర

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): తిమ్మారెడ్డితండాలో పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు తండాలో బస చేసినట్లు ఆయన తెలిపారు. నాయకులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సుభాష్‌రెడ్డి సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. వైస్ ఎంపీపీ నర్సింలు, నేతలు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవులు, అఫీజ్, కాశీరాం తదితరులున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): పోచారం తండా విద్యుత్ కార్యాలయం సమీపంలో గురువారం ఉదయం మిషన్ భగీరథ పైపులైన్ పగిలి మంచి నీరు పైకి ఎగజిమ్ముతోంది. నాణ్యమైన పైపు లైన్ వేయకపోవడం వల్లనే ఇలా జరుగుతుందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి త్వరగా మరమ్మతులు చేయించి, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వలకు చిక్కిన 25 కిలోల చేప



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకార్మికుడు రాములుకు గురువారం 25 కిలోల బరువున్న భారీ బొచ్చ చేప చిక్కింది. ప్రాజెక్టు నీటిలో చేపల వేట కోసం వేసి వలలకు భారీ చేప చిక్కడంతో మత్స్యకార్మికులు ఒడ్డుకు చేర్చారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిజాంసాగర్ ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తుండటంతో చేపల సంపద పెరిగిందని మత్స్యకార్మికుడు రాములు తెలిపారు.

జీవ ఎరువులతో అధిక దిగుబడి

మాచారెడ్డి: జీవ ఎరువులతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని మాచారెడ్డి వ్యవసాయాధికారిణి రమ్యశ్రీ సూచించారు. అంకిరెడ్డిపల్లి తండాలో గురువారం జీవ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. భాస్వరాన్ని మరిగించి జీవ ఎరువులను ఎలా తయారు చేస్తారో అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవ ఎరువులను వాడాలని ఆమె సూచించారు.

సంక్షిప్తం

బీజేపీకి రాజీనామా

భిక్కనూరు: భిక్కనూరు బీజేపీ కార్యవర్గసభ్యుడు పొట్టిగిని శశికుమార్ తన పదవికి, పార్టీ సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా భిక్కనూరు మండల కేంద్రంలో శశికుమార్ మాట్లాడుతూ.. వ్యక్తిగత కారణాల వల్ల బీజేపీకి రాజీనామా చేస్తున్నానన్నారు. ఏ పార్టీలో చేరే ఆలోచన లేదన్నారు. ఎన్నికల్లో గెలుపొంది అధికారం చేజిక్కించుకోవాలని నేతలు చూస్తున్నారే తప్ప ప్రజలకు అవసరమైన పనులు చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. అందుకే రాజీనామా చేసినట్లు వివరించారు.

67వ సారి రక్తదానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్ తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం 67వ సారి రక్తదానం చేశారు. 2007లో 78 మంది రక్తదాతలతో కామారెడ్డి సమూహం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు 2,653 మంది చేరినట్లు రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. వేద ప్రకాష్ యేడాదికి నాలుగుసార్లు చొప్పున రక్తదానం చేయడం పట్ల పలువురు అభినందించారు.

పోస్టాఫీస్‌లో జాతీయ జెండాల అమ్మకం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయని పోస్టాఫీస్ అధికారి షేక్ అసిఫ్ పేర్కొన్నారు. ఆయన గురువారం పోస్ట్ ఆఫీస్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. రూ.25కే జాతీయ జెండాను అందిస్తున్నామని తెలిపారు.

దుకాణాలు పోయిన వారికి స్థలాలు ఇవ్వాలి

ఎల్లారెడ్డి: పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో దుకాణాల స్థలాలను కోల్పోయిన వారికి మున్సిపల్ నుంచి స్థలాన్ని కేటాయించాలని దుకాణాల స్థలాలు కోల్పోయిన బాధితులు రాహుల్, హైమద్‌లు గురువారం మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ వాసంతికి వినతిపత్రం అందించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ప్రభుత్వ ఆస్పత్రికి రోడ్డు వేసేందుకు తాము ఎన్నో ఏళ్ల నుంచి ఉంటున్న స్థలాలను కోల్పోయామని వారు వాపోయారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో గురువారం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఈ శిబిరాన్ని జిల్లా వైద్య అధికారి సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. విండో చైర్మన్ సదాశివ రెడ్డి, విండో సీఈఓ భైరయ్య, వైస్ చైర్మన్ పశుపతి, తదితరులు పాల్గొన్నారు.

మారవారి గుడాడి రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): తిర్మన్‌పల్లిలో గురువారం గుడాడి రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మార శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మార రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డి, చిన్న గంగారెడ్డి, కోశాధికారిగా మహిపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, రమేష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సలహాదారుడిగా మార బాల్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.

పశువులకు గాలికుంటు టీకాలు

నిజాంసాగర్/పెద్దకొడప్‌గల్(జుక్కల్): నిజాంసాగర్‌మండలంలోని తెల్గాపూర్, మంగ్లూర్ జీపీల్లో, పెద్దకొడప్‌గల్ మండలం వడ్లం గ్రామంలో గురువారం పశువసంవర్ధ శాఖ ఆధ్వర్యంలో పశువుకు గాలికుంటు టీకాలు వేశారు. పాడి రైతులు తమ పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యులు సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట కాంగ్రెస్‌లో అసమ్మతి

రాజంపేట: రెండు రోజుల క్రితం రాజంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, యూత్ అధ్యక్షుల నియామకం పట్ల రాజంపేట ఎన్ఎస్‌యూఐ నాయకులు షేక్ జమీల్, ఇమ్రాన్ అలీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పాత వారికే మళ్లీ పదవులు కట్టబెట్టడం సరికాదని, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే యువతకు సైతం పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సొసైటీ డైరెక్టర్‌గా ఓడిన వ్యక్తికి మండల అధ్యక్ష పదవి కట్టబెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇకపై రాజంపేటలో జరిగే కార్యక్రమాలను తామే నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. నేతలు అప్సర్ అలీ, సాయి, నితీష్, సంతోష్, సల్మాన్, ముజ్జు, శ్రావణ్ పాల్గొన్నారు.

సమాచారం..

టీజీటీ, పీజీటీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న టీజీటీ, పీజీటీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. టీజీటీకి సంబంధించి తెలుగు, ఇంగ్లిష్, సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పీజీటీకి సంబంధించి తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఫిజిక్స్, బోటనీ, మ్యాథమెటిక్స్, ఎకానామిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె చెప్పారు. టీజీటీ పోస్టులకు డిగ్రీ, బీఎడ్ చదివినవారు, పీజీటీ పోస్టులకు బీఎడ్, పీజీ చదివినవారు అర్హులని తెలిపారు. ఈ నెల 14, 16 తేదిలలో తమ పాఠశాలలో డెమో తరగతులు నిర్వహిస్తామని, 18న ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్లతో నేరుగా డెమో తరగతులకు హాజరవ్వాలని కోరారు.

మూడు నెలల్లో ఒక్కసారైనా కార్డును వినియోగించాలి



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ అతుల్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఖాతాదారులు మూడు నెలల్లో ఒక్కసారైనా ఏటీఎం కార్డును వినియోగించాలని నాగిరెడ్డిపేట యూనియన్ బ్యాంకు మేనేజర్ అతుల్ తెలిపారు. నాగిరెడ్డిపేట యూనియన్ బ్యాంకులో గురువారం ఆయన మాట్లాడారు. ఖాతాదారులు అలా వినియోగించకపోతే ఇన్సూరెన్స్ వర్తించదని చెప్పారు. ప్రస్తుతం చాలామంది ఫోన్‌పే, గూగుల్ పే, ఫోన్‌పేల ద్వారానే లావాదేవీలు జరుపుతున్నారన్నారు. ఖాతాదారులు తప్పకుండా వారి ఏటీఎం కార్డును వినియోగించాలని పేర్కొన్నారు.

ఆగస్టు 15న మొక్కలు నాటాలి

బిచ్కుంద(జుక్కల్): స్వాతంత్ర్య దినోత్సవం రోజున గ్రామాల్లో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎంపీవో మహబూబ్ అన్నారు. గురువారం జీపీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కనీసం వెయ్యి మొక్కలు నాటాలని కార్యదర్శులను ఆదేశించారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి వెంబడి ఇటీవల చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గురువారం పరిశీలించారు. సెంట్రల్ లైటింగ్, డివైడర్, నరసన్నపల్లి వద్దనున్న స్వాగత తోరణాలను పరిశీలించి తొందర్లోనే ఆయా పనులకు సంబంధించిన ప్రారంభోత్సవాలు చేపడతామన్నారు. అందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, నాయకులు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, హఫీజ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో పంటలు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రాహ్మణపల్లిలో గురువారం ఎల్లారెడ్డి వ్యవసాయ సహాయ సంచాలకురాలు రత్న పంటలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి చీడపీడల నివారణ గురించి రైతులకు సూచనలు చేశారు. సోయచిక్కుడు పంటలో పల్లాకు తెగులు సోకిందని దాని నివారణకు ఎకరానికి 300 గ్రాముల అసిఫేట్ లేదా 40 గ్రాముల అసిటామాప్రిడ్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏవో శ్రీకాంత్, తదితరులున్నారు.

గాంధారి పరిధిలో..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఏవో నరేష్ పర్యటించి క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించినట్లు తెలిపారు. వరి, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి తదితర పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతుల గురించి వివరించినట్లు తెలిపారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగాద లక్ష్మీనరసింహులు అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో గురువారం పద్మశాలి రాజకీయ యుద్ధభేరికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పద్మశాలీలు అందరు కలసి, ఐక్యమత్యంతో ఉండాలని సూచించారు. ఈనెల 13న కోరుట్ల సభను విజయవంతం చేయాలని కోరారు.

పాపన్న జయంత్యుత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



రాజంపేట: మండల కేంద్రంలో గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం సర్దార్ సర్వాయి పాపన్న జయంత్యుత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గోల్కొండ కోటను ఏలిన మహానీయుడు సర్దార్ సర్వాయి పాపన్న చరిత్ర భావితరాలకు ఆదర్శమన్నారు.ఈ నెల 13న రవీంద్ర భారతిలో నిర్వహించబోయే పాపన్న ఉత్సవాలకు గౌడ సంఘ సభ్యులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

నాగిరెడ్డిపేటలో జైగౌడ ఆధ్వర్యంలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఈ నెల 13న రవీంద్రభారతిలో జరిగే పాపన్నగౌడ్ జయంతుత్సవాలను విజయవంతం చేయాలని జైగౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగా గౌడ్ కోరారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రేణుకా మాత ఆలయం వద్ద గురువారం సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల గౌడసంఘం నేతలతో కలిసి ఆవిష్కరించారు.

ఆర్థిక సాయం

ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు గోర్తీశ్వర ట్రస్టు సభ్యులు గురువారం నగదు అందించారు. టాపర్లుగా నిలిచిన పవార్ నందిని, హరిణీలకు గోర్తీశ్వర ట్రస్టు సభ్యులు తిరుపతిరెడ్డి రూ.10 వేల చెక్కును అందించారు. న్యాయమూర్తి సాయి శ్రీ, ఎంఈవో వెంకటేశం, తదితరులున్నారు.

స్టేషనరీ పంపిణీ



రామారెడ్డి: రెడ్డిపేట్ జెడ్పీహెచ్ఎస్‌లో చదివిన పూర్వ విద్యార్థి బండ సురేందర్ రెడ్డి విద్యార్థులకు అండగా నిలిచారు. గురువారం 9, 10వ తరగతి చదువుతున్న 125 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌లు, పరీక్ష ప్యాడ్లను అందజేశారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను గల్ఫ్‌లో చాలామంది కష్టాలు చూశానని, చదువు లేని వాళ్లు ఏదో ఒక పని చేస్తూ బాధపడుతున్నారని, విద్యార్థులకు చదువు ఎంతో ముఖ్యమన్నారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, పోసానిపేట్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



దోంగ్లీలో నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు



మత్తమాల పీహెచ్‌సీ ఎదుట ..

మద్నూర్(జుక్కల్): తమ సేవలు గుర్తించి ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని ఏఎన్ఎంలు కోరారు. డోంగ్లీ పీహెచ్‌సీ ఎదుట గురువారం మండల ఏఎన్ఎంలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్త చేశారు. అనంతరం వైద్యాధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..15 ఏళ్లుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నామని, కరోనా కష్ట కాలంలో ఎంతో కష్టపడి విధులు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన ఏఎన్ఎం నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. ఏఎన్ఎం సరోజ, పుష్పలత, సంగీత, శోభ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

మత్తమాల పీహెచ్‌సీ ఎదుట..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని కోరుతు మత్తమాల పీహెచ్‌సీ ఎదుట గురువారం నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. కాంటాక్టు ఉద్యోగులుగా ఉన్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలు ఇందిర, సుధ, శ్రీలత తదితరులున్నారు.

‘గృహలక్ష్మి’కి దరఖాస్తు చేసుకోవాలి

దోమకొండ: అర్హులు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని, గడువు ముగిసిపోలేదని తహసీల్దార్ సంజయ్‌రావ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటరు ఐడీకార్డు, స్థల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీటితో పాటు ఆదాయం, కులధ్రువీకరణ పత్రాలు కూడా సమర్పించాలన్నారు. జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, రైతు బంధు జిల్లా డైరెక్టర్ శంకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కౌశిక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సంజయ్‌రావ్

రాజంపేటలో దరఖాస్తుల వెల్లువ

రాజంపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మికి పథకానికి మండలంలో ఆశావాహులు భారీగా దరఖాస్తు చేసకున్నారు. రాజంపేట తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం 172 దరఖాస్తులు, గురువారం 680 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శాంత తెలిపారు.

ఎల్లారెడ్డిలో 1,259 దరఖాస్తులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలో గృహలక్ష్మి పథకానికి సంబంధించి 1,259 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు గురువారం తెలిపారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని 12 వార్డుల నుంచి 553, 31 గ్రామ పంచాయతీల పరిధిలో 706 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

గ్రామాల్లో అనాథలను గుర్తించాలి



గాంధారిలో కార్యదర్శులతో సమీక్షిస్తున్న డీఎల్పీవో



జక్షిజాన్కంపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నాగిరెడ్డిపేట/గాంధారి/బిచ్కుంద(ఎల్లారెడ్డి): గ్రామాల్లో సర్వే చేపట్టి అనాథలను గుర్తించాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్, ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్, బిచ్కుంద ఎంపీడీవో ఆనంద్ సూచించారు. నాగిరెడ్డిపేట, గాంధారి, బిచ్కుంద మండల కేంద్రాల్లో గురువారం పంచాయతీ కార్యదర్శులతో వారు సమావేశం నిర్వహించారు. 23 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి వారి స్థితిగతులు ఎలా ఉన్నాయి.. వారు ఎవరి సంరక్షణలో ఉన్నారు.. చదువుకుంటున్నారా లేదా పూర్తి వివరాలు సేకరించి నివేదిక తయారు చేసుకోవాలని సూచించారు. పై అధికారుల నుంచి సర్వే నివేదికలు కావాలని కోరిన వెంటనే సమర్పించాల్సి ఉంటుందన్నారు. సర్వే వివరాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. అనాథలతో పాటు వారి సంరక్షకుల వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని చెప్పారు.

అనాథల గుర్తింపు సర్వే పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జలాల్‌పూర్, జక్షిజాన్కంపల్లి గ్రామాలలో చేపట్టిన సర్వేను ఎంపీడీవో రఘు పరిశీలించారు. మెల్లకుంటతండాలో చేపట్టిన సర్వేను ఎంపీవో శ్రీనివాస్ పరిశీలించారు.

20న పిట్లంలో దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు

బాన్సువాడ : ఈ నెల 20న పిట్లంలో దళిత గిరిజన ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యాల సంతోష్ అన్నారు. బుధవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులను ఏకతాటిపైకి తీసుకొస్తున్నామని అన్నారు. పిట్లంలో జరిగే దళిత గిరిజన ఆత్మగౌరవ సభకు ఆకునూరి మురళి(ఐఏఎస్), ప్రొఫెసర్ కాశీం, తదితరులు హాజరవుతున్నారని అన్నారు. నాయకులు చంద్రశేఖర్, శంభ్యా నాయక్, విఠల్, నారాయణ, అమర్‌సింగ్, ప్రవీణ్ ఉన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డి: బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ సూచించారు. గురువారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో డెక్కన్ గ్రామీణ బ్యాంకు వారి గృహ రుణాల లోన్ మేళా కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ రుణాలతో పాటు ఇతర రుణాలను పొందేందుకు బ్యాంకులను సంప్రదించాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, డెక్కన్ గ్రామీణ బ్యాంకు అధికారులు సంతోష్, స్వాతి, ఆర్ముగం తదితరులున్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్

కోర్సులను తొలగిస్తే ఊరుకోం



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఎదుట ఏబీవీపీ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. కళాశాలలో ఉన్న కోర్సులను తగ్గించినందుకు వారు నిరసన తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రీషియన్, మెకానిక్ డీజిల్, ఫిట్టర్, కోపా కోర్సులు ఉండగా ఈ ఏడాది కోపా కోర్సుకు మాత్రమే అడ్మిషన్లు కేటాయించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్సులన్నింటిని కొనసాగించాలని అన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. నేతలు తులసి, విద్యాసాగర్ తదితరులున్నారు.

మీలోని ప్రతిభకు చక్కటి అవకాశం

నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో సేల్స్ ప్రమోటర్లుగా పనిచేయుటకు యువతీ, యువకులు కావలెను.

- అర్హతలు : కనీసం 10వ తరగతి పాసై ఉండవలెను.
- వయస్సు : 19 నుండి 30 సం॥లోపు వారై ఉండాలి.
- జీతభత్యాలు : రూ.15000/- జీతం+ఇన్‌సెంటివ్స్

తప్పనిసరిగా ఆండ్రాయిడ్ ఫోన్ కలిగి ఉండవలెను.

మార్కెటింగ్ రంగంపై ఆసక్తి ఉన్నవారు బయోడేటా, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, సర్టిఫికెట్లు & ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించండి.

ఇంటర్వ్యూ తేది: 12-08-2023
శనివారం ఉ॥ 11 గం॥ల నుండి మ॥ 2 గం॥ల వరకు

ఇంటర్వ్యూ జరుగు ప్రదేశము : ఆర్యన్ B.Ed కాలేజ్ బస్టాండ్ దగ్గర, కామారెడ్డి
సెల్: 70955 23222, 99496 99861

SAKSHI MEDIA GROUP
www.sakshi.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

యం.మధుసూదన్ (ACO) : 99510 27699
డి.యల్.ఎన్.గౌడ్ (ఎల్లారెడ్డి) : 95731 30288
కె.రాజు (కామారెడ్డి) : 99496 99861
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899